సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

శనివారం, జూన్ 01, 2024

డిజిటల్




## ఎరువులు, విత్తనాలు

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

# అందుబాటులో ఉంచాలి

### వేములవాడలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) : జిల్లాలోని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత విత్తన, ఎరువుల దుకాణ దారులు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేములవాడ టౌన్ లో గల మన గ్రోమోర్ సెంటర్, శ్రీ లక్ష్మి ఎరువుల విత్తనాలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విక్రయాల నిర్వహణను, రిజిస్టర్‌లను, స్టాక్ వివరాలు కలెక్టర్ పరిశీలించారు. వానాకాలం 2024 పంటలకు జిల్లాలో అవసరమైన మేర ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు గానే స్టాక్ పెట్టుకుని రైతులకు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నదని, మన జిల్లాలో సైతం ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మేర ఎరువుల నిలువలు అందుబాటులో ఉంచుకోవాలని, ఎరువుల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మకూడదనీ, అమ్మినచో కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు సరిపోయే పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తే పీడీ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఓ సాయి కిరణ్ తదితరులు ఉన్నారు.




సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి

'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'

ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి

సెల్ : 99854 44342



## బాధిత కుటుంబానికి చేయూత

**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి) :** మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బండి రాయమల్లవ్వ కుటుంబానికి నిలువ నీడ లేకపోవడం వల్ల వారి కుటుంబ పరిస్థితి చూసి ఎర్ర రాజు ఫౌండేషన్ తరపున 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్ర వినయ్, మేడదుల కుమార్, భాను, సాయి రజినీ కాంత్ ఉన్నారు.



## తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన గంట సాయగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తన తండ్రి 14 వ సంవత్సరీకం సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గంట వెంకటేష్‌గౌడ్ ఎల్లారెడ్డిపేటలో గల డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు సాయగౌడ్ కుమారుడు కోడలు వెంకటేష్ గౌడ్, రేణుక అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, వరదవెల్లి రచన్‌గౌడ్, ఎల్లారెడ్డి పేట తాజా మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత యాదవ్, గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు నాగుల ప్రదీప్ గౌడ్, ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు అజ్జూ, పాత్రికేయ బృందం ఒగ్గు మహేష్ యాదవ్, పంజా సంపత్ కుమార్, కట్టెల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 'సెస్' ఎదుట నిరసన

రూ.లక్షల్లో బకాయిలు పెండింగ్‌లో ఉన్నవారి కరెంట్ చేయకుండా, తక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న వారి కరెంట్ లైన్ కట్ చేయడంపై ఎల్లారెడ్డిపేట సెస్ వినియోగదారుడు సంతోష్ శుక్రవారం సెస్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు.

**- తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట)**

### పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నియంత్రించేందుకు

# ప్రణాళికాబద్ధంగా చర్యలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- పొగాకు వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలి





**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి పొగాకు వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో పొగాకు కంట్రోల్ అంశంపై అదనపు కలెక్టర్ పి గౌతమితో కలిసి జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పొగాకు వాడకాన్ని నియంత్రించేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగ కూడదు అనే స్పష్టమైన బోర్డులను ఏర్పాటు చేయాలని, సమీకృత జిల్లా కలెక్టరేట్ మొదలుకొని వేములవాడ ఆలయం, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు ఆసుపత్రులు మండల కార్యాలయాలు, బస్టాండ్ , ఆలయాలు, మార్కెట్, సినిమా ధియేటర్లు మొదలగు జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో జూన్ 15 నాటికి పొగాకు త్రాగకూడదు అనే బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ చివరి నాటికి జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో పొగాకు వాడకం వల్ల కలిగే కష్టాలను విద్యార్థులకు స్పష్టంగా వివరించాలని, పొగాకు ఉత్పత్తులు వాడకం వ్యతిరేకంగా వ్యాసరచన పోటీలు, వివిధ రకాల పోటీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలలో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వైద్యులు ప్రత్యేక సెషన్స్, కాన్సిల్లింగ్ నిర్వహించాలని కలెక్టర్ కోరారు.

పొగాకు తాగే అలవాటున్న వ్యక్తులు ఆ అలవాటు మానుకునేలా సహకారం అందించేందుకు జిల్లాలో డీ అడక్షన్ కేంద్రం, మద్యం పొగాకు వంటి దురలవాట్లు ఉన్న వారి కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన డీ అడక్షన్ కేంద్రం వినియోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టం –2003 పై అవగాహన కలిగి అందులోని నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, పొగాకు ఉత్పత్తుల నిషేద చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులపై ప్రచారం, విద్యాలయాల చుట్టూ 100 గజముల లోపు పొగాకు సేవనం, ఉత్పత్తులపై అమ్మకం నిషేదమని,18సం.లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం, వారిచే అమ్మించడం నిషేదమని, ఈ నిబంధనలు జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ సుమన్ మోహన్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, డి.పి.అర్. ఓ. వి.శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ కిక్ బాక్సింగ్‌లో యెల్లె హరిహరకు రజతం



**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) : రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యెల్లె హరిహర నేషనల్ కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 21 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని పూణే జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2024 పాల్గొని పాయింట్ ఫైవ్, లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు రజిత పథకాలు సాధించాడు. గతంలోనూరాజన్న సిరిసిల్ల జిల్లా డిస్టిక్ లెవెల్ కిక్ బాక్సింగ్2024 పోటీల్లో గోల్డ్ మెడల్, స్టేట్ లెవెల్ కిక్ బాక్సింగ్ 2024 వనపర్తి జిల్లా వనపర్తి జరగగా అందులో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా హరిహరను జిల్లాకు చెందిన ప్రముఖులు అభినందించారు. హరిహర మరెన్నో పథకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.**





## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# నివారణ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలి
- పట్టణాల్లో ఉన్న మేజర్ డ్రెయిన్ డీసిల్టింగ్ పూర్తి చేయాలి
- ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచాలి
- పాతబడిన భవనాలను కూలిపోయే సీట్లు ఉన్న కట్టడాలను వేగవంతంగా తొలగించాలి
- నాలాలపై ఉన్న అక్రమ కట్టడాలు తొలగించాలి




**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** రాబోయే వానాకాలం లో మన జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజన్ సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ పి గౌతమితో కలిసి జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో మీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలన్నారు. అక్కడ నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ 7 నాటికి ప్రతి గ్రామం వారిగా, ప్రతి మున్సిపల్ వార్డు వారిగా నీరు నిలువ ఉండే ప్రాంతాల వివరాలు సమర్పించాలని, ప్రతి మంగళ/ శుక్ర వారాలలో డ్రైడే కార్యక్రమంలో వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మత్తుకు గ్రామీణ ఉపాధి హామీ నిధులు వినియోగించుకొని పనులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించాలని, నీరు అధికంగా నిలువ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయాలని, ఆయిల్ బాల్స్ వేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పట్టణాల్లో ఉన్న మేజర్ డ్రెయిన్లను డీసెల్టింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో , పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలచే అవసరమైన మేర ఆయిల్ బాల్ తయారు చేసి సన్నద్ధం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అక్కడ అధికంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆకస్మికంగా కురిసే భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మానేరు , మూల వాగుల ప్రవాహాలు అంతరాయం కలగకుండా సజావుగా సాగేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్ట్ లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా కూలిపోయే స్థితిలో ఉన్న పాడైపోయిన భవనాలు, పాతబడిన భవనాలను తొలగించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళ వారం మరియు శుక్రవారం డ్రై డే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. నాలాల పై ఉన్న అక్రమ నిర్మాణాలను ,కట్టడాలను తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఉమారాణి,మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అవినాష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ సుమన్ మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిందితుడిని శిక్షించి న్యాయం చేయాలి


**ఎల్లారెడ్డిపేట ఠాణా ఎదుట గిరిజనుల ధర్నా**

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** నిందితుడిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని కోరుతూ గిరిజనులు ఎల్లారెడ్డిపేట ఠాణాను ముట్టడించారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. సంఘటన వివరాల్లోకి వెళితే వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా గ్రామానికి చెందిన బానోతు మమత (21) గురువారం అనుమానాస్పదంగా ఊరి వేసుకొని బలవన్మరనానికి పాల్పడింది. తమ కూతురిని ప్రేమించిన వ్యక్తి మరొకరితో కలిసి ఉరివేసి హ్యత చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి తల్లితండ్రులు ఆరోపించారు. నిందితులను వెంటనే తమకు అప్పజెప్పాలని నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ముందు సుమారు 20 నిమిషాలుగా ధర్నా చేశారు. సమాచారం అందుకున్న సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేటకు చేరుకొని బాధితులతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



## వాటర్ బెడ్ శుభ్రం చేయాలి

**తెలంగాణ ప్రభ, (కోటగిరి) :** వాటర్ బెడ్ శుభ్రపరచకపోవడం వల్ల తాగునీటిలో పురుగులు, జలగలు వస్తున్నాయని సంబంధిత అధికారులపై గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ సీసీ రోడ్లు వేశారు ఇరువైపుల మొరం వేయడం మరిచారని దానివల్ల ప్రమాదలకు గురవుతున్నారని గ్రామ సభలో ప్రజలు తెలిపారు. దానిపై చర్య తీసుకుని అధికారులు మొరం వేయించాలని గ్రామసభలో ప్రజలు కోరారు. పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపిఓ మారుతి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో పలువురు సమస్యలను వెల్లడించారు. వాటర్ బెడ్ క్లీన్ చేయకపోవడం వల్ల త్రాగునీటిలో జలగలు, పురుగులు వస్తున్నాయని దానిపై అధికారులు దృష్టి సరించాలని, పశువైద్యాధికారి అందుబాటులో లేకపోవడం వలన ఇబ్బంది అవుతుందని తెలిపారు. ఎంపీ మారుతి మాట్లాడుతూ... ఈ సమస్యలపై త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రకాంత్ మాజీ సర్పంచ్ రమేష్ సెట్ ఎంపీటీసీ కేశ వీరేశం, లక్ష్మణ్, బజరంగ్ దత్తు గంధపు దత్తు ధనరాజ్, కాషా గౌడ్ తదితరులు ఉన్నారు.



## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

**తెలంగాణ ప్రభ, (కోటగిరి) :** విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలు గుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుందన్న గ్రామస్తుల విమర్శలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. పోతంగల్ మండలం జల్లపల్లి ఫారంలో శుక్రవారం మిట్ట మధ్యాహ్నం వీధి దీపాలు వెలుగుతున్నయి.వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్య లను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ముగిసిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** సిరిసిల్ల రాళ్లబావి దగ్గర గల శ్రీకృష్ణ మందిరంలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వికాస తరంగిణి ప్రజ్ఞా వికాస్ కోఆర్డినేటర్ పెద్ది రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత, యోగ, ధ్యానం భక్తి పాటలు, లాంటి ఉచిత వేసవి తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ తరగతులు నిర్వహకులు సిరిసిల్ల వికాస తరంగిణి సభ్యులు పెద్ది రాజ్యలక్ష్మిని శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. యోగా భక్తి పాటలు నేర్పించిన ప్రేమ్‌కుమార్, శ్రీనాథ్‌ను వికాస తరంగిణి మాజీ అధ్యక్షులు పత్తిపాక శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య మంగళా శాసనములతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వేసవిలో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు, పాటిస్తూ సామాజిక స్పృహతో మానవతా విలువలను పెంపొందించుకుంటూ క్రమశిక్షణాయుతమైన జీవనం సాగించేందుకు భగవద్దీత ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత చదవాలని సూచించారు. అనంతరం భగవద్గీత శ్లోకాలు శ్రద్ధతో నేర్చుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థిని విద్యార్థులకు చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ నాయిని మంగ, ఆరోగ్య వికాస్ కోఆర్డినేటర్, అంజనాదేవి, వికాస తరంగిణి మాజీ అధ్యక్షులు పత్తిపాక శ్రీనివాస్, కోశాధికారి నరహరి, యువ వికాస్ ఆర్డినేటర్ పెద్ది శ్రీనివాస్, బూట్ల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్ పెంచిన తర్వాతే

# స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

- ప్రభుత్వం కులగణన చేసి రిజర్వేషన్లు పెంచుతారనే విశ్వాసం బీసీలకుంది
- రిజర్వేషన్లు పెంచి బీసీల వాటా బీసీలకు దక్కాలి
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** కుల గణన విషయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేరుస్తారనే ఇప్పటికీ నమ్ముతున్నామని, రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్తారని బిసిలు విశ్వసిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. జూన్ 4న ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్రంలో కులగనణ చేపట్టడానికి ప్రత్యేకంగా ఒక కులగనణ కమిషన్ ను ఏర్పాటు చేసి తక్షణమే కులగనన ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి పర్శ హన్మాండ్లు విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళతామని అధికారికంగా ఈరోజు వరకు ఎక్కడ కూడా చెప్పలేదన్నారు,బీసీలకు గతంలో రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసిన కేసీఆర్ చేసిన పొరపాటు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేయడని తాము ప్రగాఢంగా నమ్ముతున్నామని పర్శహన్మాండ్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "స్థానిక సంస్థల ఎన్నికలు- బీసీ రిజర్వేషన్ల పెంపు- భవిష్యత్ కార్యాచరణ" పై బీసీ కుల సంఘాలు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలనలో బీసీ కులాల లెక్కలు తీయకుండా బీసీ రిజర్వేషన్లు తగ్గించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను రాజకీయంగా గొంతు కోశారని, బిసి కులగనణ నిర్వహించి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడమే కాకుండా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎన్నికల బహిరంగ సభలలో అదేవిధంగా, స్వయంగా బీసీ సంఘాలకు హామి ఇవ్వడంతో బీసీలు విశ్వసించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేశారని పర్శ హన్మాండ్లు తెలిపారు.

ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర క్యాబినెట్లో, అదేవిధంగా రాష్ట్ర అసెంబ్లీలో సమగ్ర కులగనణ చేపడతామని ఏకగ్రీవ తీర్మానం చేశారని అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 26 ను తీసుకువచ్చి 150 కోట్ల బడ్జెట్ కూడా కేటాయించిందని ఆయన అన్నారు ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అటు దేశంలో ఇటు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 4 వరకు కులganana ప్రక్రియ తాత్కాలికంగా ఆగిపోయిందని అనుకుంటున్నామన్నారు కులగణన, రిజర్వేషన్ లపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లు పదేపదే మొన్నటి ఎన్నికల్లో కూడా హామీ ఇచ్చినందున వారి మాటలను విశ్వసిస్తున్నామని ఎన్నికలు కోడ్ జూన్ 4న ముగియగానే రెండు మూడు రోజుల్లోనే రాజ్యాంగబద్ధమైన ప్రత్యేకంగా ఒక కులగనణ కమిషన్ ను ఏర్పాటు చేసి ఆ కమిషన్ ద్వారా సమగ్ర కులగనణ చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పర్శ హన్మాండ్లు కోరారు.

ఎన్నో సంవత్సరాలగా పోరాడి కులగనణ అంశాన్ని ఒక ప్రధాన అంశంగా తీసుకు వచ్చామని, ఈ ప్రక్రియను పక్కదారి పట్టించడానికి గతంలో రిజర్వేషన్లు తగ్గించి బీసీలను రాజకీయంగా అణచివేసిన వాళ్లే తెర వెనక ఉండి బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు నిజంగా బీసీలకు ఏ పార్టీ అయినా, ఎ ప్రభుత్వమైనా అన్యాయం తలబెట్టాలని చూస్తే ముందు వరసలో ఉండి పోరాడేది మేమే అని, ఇది గమనించాలని ఆయన బీసీలను కోరారు, త్వరలోనే కులగనన ప్రక్రియను వేగవంతం చేయడం కోసం ప్రత్యేక కులగనణ కమిషన్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలవనున్నట్లు పర్శ హన్మాండ్లు ప్రకటించారు.

శాస్త్రీయమైన కుల గణన ద్వారానే భవిష్యత్తులో ఎలాంటి న్యాపరమైన వివాదాలు రాకుండా బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉంటుంది అని కులగనన లేకుండా ఇతర మార్గాల ద్వారా బీసీ రిజర్వేషన్లు పెంచడం సాధ్యం కాదని ఆయన అన్నారు బిహార్ రాష్ట్ర తరాహలోని తెలంగాణ రాష్ట్రంలో కూడా కులగనణ చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని ఆయన కోరారు బీసీ కులగనణ సాధించడానికి ప్రభుత్వం మీద పార్టీలకతీతంగా బీసీ సంఘాలు కుల సంఘాలు జేఏసీగా ఏర్పడి పోరాడాలన్నారు ప్రభుత్వం భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో, వైస్ ఛాన్సలర్ పదవులలో జనాభా దామాషా ప్రకారం 50% కోటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు బీసీలకు అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలని ఇందుకు బీసీలంతా సంఘటితంగా ముందుకు సాగాలని పర్శ హన్మాండ్లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు వీరవేని మల్లేశ్ యాదవ్, తడుక కమలాకర్, కంచర్ల రాజు, గాజుల సాగర్, ప్రసాద్, అంజయ్య, తిరుపతి, విజయ్, భాస్కర్, ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1100 కోట్లు సీజ్

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగదు, ఆభరణాలు స్వాధీనం
- ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి మే 30 వరకు పెద్ద మొత్తం నగదు సీజ్
- 2019 ఎన్నికలతో పోల్చితే 182 శాతం అధిక మొత్తం స్వాధీనం
- ఢిల్లీ, కర్ణాటకలో ఏకంగా రూ.200 కోట్లు చొప్పున పట్టుబడ్డ నగదు, ఆభరణాలు

**ఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు-2024 నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ రికార్డు స్థాయిలో ఏకంగా రూ.1100 కోట్ల విలువైన నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో సీజ్ చేసిన రూ. 390 కోట్లతో పోలిస్తే ఇది 182 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ వర్గాలు వెల్లడించాయి. మే 30 నాటికి దేశవ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు, ఆభరణాల విలువ సుమారు రూ.1100 కోట్లు ఉండొచ్చని తెలుస్తోంది. ఢిల్లీ, కర్ణాటకలో అత్యధిక నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో రూ.200 కోట్లు చొప్పున, తమిళనాడులో రూ. 150 కోట్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలో ఉమ్మడిగా రూ. 100 కోట్ల పైచిలుకు నగదు, నగలు సీజ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల తేదీలను మార్చి 16న ప్రకటించగా.. ఆ రోజు నుంచే దేశవ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఆదాయపు పన్ను శాఖ అధికారులు నిఘా పెట్టారు. అప్రమత్తంగా వ్యవహరించి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఉపయోగించ దలచిన నగదు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈసారి మద్యం, ఉచితాలు, డ్రగ్స్, నగలు, ఇతర వస్తువుల తరలింపుపై కూడా ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. అక్రమ నగదు తరలింపును ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు అన్ని రాష్ట్రాల్లో 24 గంటలపాటు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసింది.








## చిట్టాపూర్ మాజీ సర్పంచ్ కుమారుడు మృతి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో నివసిస్తున్న ప్రభుత్వఉపాధ్యాయుడు మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఆర్ భూమయ్య రెండవ కుమారుడు రాకేష్ (28)నిన్న అర్ధరాత్రి కోరుట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దహనసంస్కారాలు జూన్ 1న ఉదయం 8:30కి కోరుట్ల పట్టణంలోని ఆదర్శ నగర్ స్వగృహంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.





## స్టోరీ బాగుంటే.. అలాంటి పాత్రలో కూడా నటిస్తా?

టాలీవుడ్ నటి కామాక్షి భాస్కర్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన అద్భుతమైన నటనతో ఈ భామ ప్రేక్షకులను ఎంతగానో మెప్పిస్తుంది. ఈ భామ నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ పొలిమేర సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సత్యం రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా మంచి విజయం సాధించింది.చేతబడి వంటి థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. గత ఏడాది ఈ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కిన పొలిమేర 2 సినిమా రిలీజ్ అయింది .ఈ సినిమా కూడా ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. ఈ సినిమాలో కామాక్షి నటన అద్భుతమని చెప్పాలి. ఈ సినిమాలో కామాక్షి నటనకు గాను అవార్డు కూడా లభించింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూ లో పాల్గొన్న ఈ భామ షాకింగ్ కామెంట్స్ చేసింది. నటనకు ప్రాధాన్యత వున్నఏ పాత్ర అయిన చేయడానికి తాను సిద్ధం అని కామాక్షి తెలిపింది. కథ డిమాండ్ చేస్తే తాను న్యూడ్ గా అయిన నటిస్తానని కామాక్షి తెలిపింది. అలాగే తనకి డాన్స్ కూడా వచ్చని.. స్టార్ హీరోల సరసన స్పెషల్ సాంగ్స్ చేసే అవకాశం వస్తే అస్సలు వదులుకోను అని కామాక్షి తెలిపింది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ భామ తన హాట్ పిక్స్ తో రెచ్చగొడుతుంది.